క్లుప్తంగా

మహిళలకు పాదరక్షల పంపిణీ

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో పేద మహిళలకు అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం పాదరక్షలు ఉచితంగా పంపిణీ చేశారు. అడబాల ట్రస్ట్ చైర్మన్, మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు నిమ్మకాయల వెంకటేశ్వర రావు మాట్లాడుతూ వేసవి రానున్నందున ట్రస్ట్ ఈ పంపిణీ చేసినట్టు తెలిపారు. విశ్రాంత తహశీల్దార్ రేలంగి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌కు ప్రజ్వల్ ప్రాజెక్టు



రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైన ప్రాజెక్టుతో సలాది ప్రజ్వల్

కాకినాడ రూరల్: కాకినాడ సాలిపేట నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్ సైన్స్ ప్రదర్శనలో మోహన్ హైస్కూల్ విద్యార్థిని ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికైంది. పాఠశాల ఉపాధ్యాయిని ఇ.కవిత పర్యవేక్షణలో 8వ తరగతి విద్యార్థి సలాది ప్రజ్వల్ తయారు చేసిన 'ఆటోమేటిక్ యంత్రంతో పురుగు మందుల వినియోగం' అనే ప్రాజెక్టు రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో కరస్పాండెంట్ మోహనరావు, డైరెక్టర్ వెంకటేష్, ప్రధానోపాధ్యాయిని నాగ దివ్యశ్రీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థిని అభినందించారు.

డిమాండ్ల కోసం నిరసన

కాకినాడ సిటీ: ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారానికి ఏపీజేఏసీ రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు ఏపీ జేఏసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాకినాడ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా గురువారం కాకినాడ రెవెన్యూ డివిజన్ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో జిల్లా ఏపీ జేఏసీ చైర్మన్ గుద్దటి రామమోహన్‌రావు, నాయకులు పేపకాయల వెంకటకృష్ణ, పాము శ్రీనివాస్, ఆర్వీ రమేష్, మోర్త శ్రీనివాస్ తదితరులు డిమాండ్లపై నినాదాలు చేశారు.

రూరల్ టిక్కెట్ శెట్టిబలిజలకు ఇవ్వాలి

కాకినాడ సిటీ: కాకినాడ అసెంబ్లీ నియోజకవర్గంలో అతి పెద్ద సామాజికవర్గమైన శెట్టిబలిజలకు సీటు కేటాయించే పార్టీనే గెలిపిస్తామని ఆ వర్గం జిల్లా నాయకులు కండిపల్లి వెంకటరమణ, వాసంశెట్టి రాజేశ్వరరావు, రాయుడు దుర్గ, వాసంశెట్టి త్రిమూర్తులు, కాకరపల్లి చలపతి రావు అన్నారు. గురువారం సాయంత్రం కాకినాడ రామారావుపేటలోని కేంద్ర శెట్టిబలిజ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీలకు శెట్టిబలిజల డిమాండ్‌ను పంపుతున్నామని, పార్టీలు శెట్టిబలిజలకు సీటు కేటాయించడకపోతే శెట్టిబలిజల తరఫున ఓ అభ్యర్థిని నిలిపి స్వతంత్రంగా పోటీ చేస్తామని ప్రకటించారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

పిఠాపురం: గ్రామాల్లో ఎవరైనా బాల్య వివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా బాలల పరిరక్షణాధికారి సీహెచ్ వెంకటరావు హెచ్చరించారు. పిఠాపురం మండల మహిళా సమాఖ్య భవనంలో గురువారం బాల్య వివాహాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఆడపిల్లలకు 18 ఏళ్లు మగ పిల్లలకు 21 సంవత్సరాలు నిండకుండా పెళ్లిళ్లు చేయడం చట్ట రీత్యా నేరమన్నారు. వివాహాలు చేయడం వల్ల ఎక్కువగా ఆడపిల్లలకు శారీరకంగా, మానసికంగా అనేక సమస్యలు వస్తాయన్నారు. బాల్య వివాహాలను పెళ్లిచూపుల సమయంలోనూ, పెళ్లి జరిగేటప్పుడు, పెళ్లయిన రెండు సంవత్సరాల వరకూ ఎప్పుడైనా ఆపవచ్చన్నారు. బాల్య వివాహాలు చేసిన వారికి రెండేళ్ల జైలు శిక్ష పడుతుందని తెలిపారు. ఈ విషయాలపై అందరికీ అవగాహన కల్పించి బాల్య వివాహాలు జరగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.

నేటి నుంచి ఉరుసు ఉత్సవాలు

కొత్తపల్లి: మండలంలోని పొన్నాడలో బషీర్ బీబీ (బంగారు పాప) దర్గా వద్ద శుక్రవారం నుంచి 69వ ఉరుసు ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు స్థానిక ముజావర్లు ఏర్పాట్లు పూర్తి చేశారు. కాగా ఈ ఏర్పాట్లను గురువారం స్థానిక ఎస్సై స్వామినాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బషీర్ బీబీ ఉరుసు ఉత్సవాలకు వచ్చే భక్తులు తమ పిల్లలను తల్లిదండ్రుల పర్యవేక్షణలో ఉంచుకోవాలని సూచించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగే గంధోత్సవం ఎంతో కీలకమైందన్నారు. ఈ ఉత్సవాలకు కొత్తపల్లి, పిఠాపురం, పిఠాపురం రూరల్, గొల్లప్రోలు మండలాల్లోని 150 మందితో సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

పేదల కన్నీళ్లు తుడిచే నేత జగన్

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- నడకుదురు, గురజనాపల్లిలలో వేడుకగా పట్టాల పంపిణీ



నడకుదురులో లబ్ధిదారులకు పట్టాలిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు



గురజనాపల్లిలో హాజరైన లబ్ధిదారులు

కరప: పేదలు, బడుగు, బలహీనవర్గాల కన్నీళ్లు తుడిచే నాయకుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అని, అందుకే ఏ రాష్ట్రంలో లేని విధంగా 32 రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. సొంతింటికల సాకారం చేయాలన్న సంకల్పంతో లక్షలాది మందికి ఇళ్లస్థలాల పట్టాలు ఇవ్వడమేకాకుండా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నట్టు తెలిపారు. గురువారం మండలం నడకుదురులో 704 మందికి, గురజనాపల్లిలో 581 మందికి ఎమ్మెల్యే కన్నబాబు స్థానిక నాయకులతో కలసి ఇళ్లస్థలాల పట్టాలను అందజేశారు. సర్పంచ్‌లు డేగల లలితకుమారి, అనసూరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ గ్రామాల వారికి గతంలో కరప సెంట్రల్ లే అవుట్‌లో పట్టాలిచ్చినా, దూరమన్న భావనతో అక్కడకు ఎవరూ రాలేదని, స్థానిక నాయకులు చెప్పడంతో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఉప్పు భూములను సేకరించేందుకు సీఎం జగన్ ద్వారా కేంద్రప్రభుత్వంతో నాలుగేళ్లుగా చేసిన ప్రయత్నాలు ఫలించడంతో పెనుగుదురు, గురజనాపల్లి గ్రామాల్లో 174 ఎకరాలు సేకరించామన్నారు. నడకుదురు, గురజనాపల్లి గ్రామస్తులకు తమగ్రామాలకు ఆనుకునే సెంటుభూమి రూ.4 లక్షల వంతున ఎంతో విలువైన స్థలాలు పట్టాలుగా ఇవ్వగలిగామని ఆయన తెలిపారు. ప్రజారంజకపాలన సాగిస్తున్న సీఎం జగన్‌పై ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, వాటిని నమ్మవద్దన్నారు. జగనన్న నాలుగున్నరేళ్ల పాలనలో మంచి జరిగిందనుకుంటేనే వచ్చే ఎన్నికల్లో ఓటువేసి మళ్లీ గెలిపించాలని అడిగే దమ్మున్న నాయకుడు జగన్ అని కురసాల అన్నారు. అలాగే స్థానికంగా మంచిచేశామని నమ్మితే ఏప్రిల్‌లో జరిగే ఎన్నికల్లో మళ్లీ ఆశీర్వదించి తనను గెలిపించాలని కన్నబాబు కోరారు. గురజనాపల్లిలో జనసేన ఎంపీటీసీ వీరవేణి మాట్లాడుతూ పదేళ్లుగా తమ కుటుంబమే ఇళ్లస్థలం కోసం ప్రయత్నించినా రాలేదని, ఇప్పుడు తమకు ఇంటి స్థలం పట్టా ఇవ్వడం సంతోషంగా ఉందని ఆనందంగా చెప్పారు. అనంతరం రూ.65 లక్షలతో నిర్మించిన అడవిపూడి రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, కరప ఏఎంసీ చైర్మన్ కర్నాసుల సీతారామాంజనేయులు, ఎంపీటీసీలు పైలా రామతులసి, ముమ్మిడి బుచ్చిరాజు, పార్టీనాయకులలతో పాటు, ఆర్డీఓ ఐ.కిశోర్, హౌసింగ్ ఏఈఈ ఎస్.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కొట్నాలోత్సవం

- ప్రాబోధికసేవ, తిరువీధి మహోత్సవం
- పాల్గొన్న ఎంపీ గీత, ద్వారంపూడి దంపతులు



వేంకటేశ్వరుని చరిత్రను భక్తులకు వివరిస్తున్న ఆగమ పండితుడు శేషాచార్యులు

కాకినాడ: శ్రీ శ్రీనివాస దివ్య కల్యాణమహోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కొట్నాలోత్సవాన్ని (పసుపు దంచే కార్యక్రమం) శాస్త్రోక్తంగా నిర్వహించారు. శుక్రవారం స్వామి వారి కల్యాణం జరగనున్న నేపథ్యంలో సాంబమూర్తినగర్‌లోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ప్రాభోదిక సేవ అనంతరం తిరువీధి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి సతీమణి మహాలక్ష్మితో పాటు సుమారు 3 వేల మంది మహిళలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఇందులో భాగంగా అర్చకులు, భక్తుల మంత్రాల మధ్య మహిళలంతా పసుపు దంచారు. వందలాదిగా తరలివచ్చిన మహిళలతో ఆనందభారతి గ్రౌండ్స్ ఆధ్యాత్మికత నెలకొంది. దంచిన పసుపుతో కల్యాణ మూర్తులకు స్నపన తిరుమంజనం (మంగళస్నానం) చేయించారు. హైదరాబాద్‌కు చెందిన తాళ్లూరి నాగరాజు బృందంతో వేదనాద సంగీత నృత్య సమ్మేళనాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. కోలాటాలతో నృత్యసేవ, మార్వాడీలతో దాండియా నిర్వహించారు. ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ఆశీస్సులతో విశాఖకు చెందిన ప్రముఖ ఆగమపండితులు గోపినం బాల శేషాచార్యులు, ప్రముఖ ఆగమపండితులు గోపినం బాల కూర్మాచార్యుల పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సతీమణి శ్రీవిద్య, ద్వారంపూడి కుమార్తెలు ప్రణీత, అంజని, కుటుంబ సభ్యులు ద్వారంపూడి మాధురి, సత్తిమానస పెద్ద సంఖ్యలో మహిళలు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్యాణోత్సవం

పద్మావతి శ్రీనివాసుల కల్యాణోత్సవాన్ని శుక్రవారం సాయంత్రం 4 గంటలకు వేడుకగా నిర్వహించేందుకు స్థానిక రంగరాయ వైద్యకళాశాల క్రీడా మైదానంలో ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 30 వేల మందికి పైగా భక్తులు వస్తారనే అంచనాతో సన్నాహాలు చేస్తున్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కల్యాణమహోత్సవాన్ని జరిపించనున్నారు. తిరుమల వేంకటేశ్వరుని ఆలయ నమూనాను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. దాదాపు 125 అడుగుల వేదికను సిద్ధం చేసి, భక్తులు వీక్షించేందుకు వీలుగా మైదానంలో సుమారు 20 ఎల్ఈడీ స్క్రీన్‌లను అమరుస్తున్నారు. భక్తులందరికీ పంపిణీ చేసేందుకు 40 వేల శ్రీవారి తిరుమల లడ్డూలను రప్పించారు. కార్యక్రమ ఏర్పాట్లను రాష్ట్ర రైసుమిల్లర్ల సంఘ అధ్యక్షుడు, ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరభద్రారెడ్డి ఆధ్వర్యంలో పర్యవేక్షించారు. పార్టీ నాయకులు సుంకర విద్యాసాగర్, మల్లిపాముల గణపతి తదితరులు ఆయన వెంట ఉన్నారు.



కల్యాణ వేదిక వద్ద దాండియా ఆడుతున్న భక్తులు



ఉత్సవ విగ్రహాలను పురవీధులలో ఊరేగిస్తున్న దృశ్యం



కొట్నాలోత్సవంలో భాగంగా పసుపు దంచుతున్న ఎంపీ గీత, ద్వారంపూడి సతీమణి మహాలక్ష్మి

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న గృహనిర్మాణశాఖ పీడీ సత్యనారాయణ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): జిల్లాలో జగనన్న కాలనీల్లో వీలైనంత త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని జిల్లా గృహనిర్మాణశాఖ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ ఆ శాఖ అధికారులను ఆదేశించారు. కాకినాడలో గృహ నిర్మాణశాఖ కార్యాలయంలో గురువారం జిల్లాలోని ఆ శాఖ ఈఈలు, డీఈలు, ఏఈలతో ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లాకు మంజూరులైన 11,777 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వీటి నిర్మాణం వేగవంతం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బేస్‌మెంట్ లెవల్‌లో నిలిచిపోయిన 5,608 ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. లింటల్ లెవల్, రూఫ్ లెవల్, రూఫ్ కాస్ట్‌లో నిలిచిన ఇళ్ల నిర్మాణాలపైన అధికారులు ఆరా తీయాలన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మంగా తీసుకున్న ఇళ్ల నిర్మాణాలు ఈ నెలాఖరులోగా పూర్తి చేసేయాలన్నారు. ఈ మేరకు అధికారులకు లక్ష్యాలను నిర్దేశించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణశాఖ ఈఈలు, డీఈలు పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ చట్టాన్ని ఉపసంహరించాలి



వాసు యేలేటి

కాకినాడ రూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని శుక్రవారం బంద్ చేపట్టనున్నట్టు జయహో రథసారధి యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసు యేలేటి పిలుపునిచ్చారు. లారీ డ్రైవర్లు, ఓనర్లు, కార్మిక సంఘాలు బంద్‌ను జయప్రదం చేయాలని ఆయన అన్నారు. అచ్చంపేట జంక్షన్ వద్ద యూనియన్ కార్యాలయంలో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం అవలంబిస్తున్న నల్ల చట్టం రద్దు చేయకపోతే డ్రైవర్ల పాలిట ఉరి తాడు అవుతుందన్నారు. చట్టాన్ని రద్దు చేయడంతో పాటు రూ.20 లక్షల బీమా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. దేశ వ్యాప్తంగా జరుగుతున్న బంద్‌లో పాల్గొంటామన్నారు.

వరిలో తెగుళ్లపై అప్రమత్తం

పెద్దాపురం: ప్రస్తుతం వరి సాగులో ఎదురవుతున్న తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్, శాస్త్రవేత్త సీహెచ్‌వీ నరసింహారావు అన్నారు. మండలంలోని గోరింట, జె.తిమ్మాపురం గ్రామాల్లో వరి పంటలను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 73,500 హెక్టార్లలో రబీ సాగవుతుండగా 65,472 హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారన్నారు. ఎక్కడా ఎండాకు తెగులు సోకలేదేని, కొద్ది మేర కాండం తొలుచు పురుగు ఆశించిందని, దీని నివారణకు చర్యలు చేపట్టాలన్నారు.

గాన ప్రవీణుడు

- శాస్త్రీయ సంగీత పోటీల్లో బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి ప్రతిభ
- జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి



డాక్టర్ కల్యాణ్‌సాగర్ నుంచి ప్రథమ బహుమతిని అందుకుంటున్న ముకుంద్ ప్రవీణ్

బోట్‌క్లబ్: అఖిలభారత 20వ బీఎస్ఎన్ఎల్ శాస్త్రీయ సంగీత పోటీల్లో కాకినాడకు చెందిన ముకుంద్ ప్రవీణ్‌కు ప్రథమ బహుమతి లభించింది. గురువారం నాగ్‌పూర్‌లో జరిగిన జాతీయస్థాయి శాస్త్రీయ సంగీత పోటీల్లో ఆ సంస్థ హెచ్ఆర్ డైరెక్టర్ డాక్టర్ నిప్పని కళ్యాణ్ సాగర్ నుంచి ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. స్థానిక శాఖలో జూనియర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ప్రవీణ్ ఇప్పటికే మూడుసార్లు ప్రథమ బహుమతిని అందుకున్నారు. చిన్నతనం నుంచి సంగీతం అంటే ప్రాణంగా భావించిన ప్రవీణ్.. సంగీత విదుషీమణి పెద్దాడ సూర్యకుమారి వద్ద శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నారు. ప్రవీణ్‌ను ఆ సంస్థ అధికారులు సిబ్బంది ప్రశంసలతో ముంచెత్తారు.

'సంగీత శిఖామణి'

ముకుంద్ ప్రవీణ్ ఆరేళ్ల వయసులోనే బాల మేధావి అవార్డు అందుకున్నారు. పద్మభూషణ్ వెంపటి చినసత్యం కూచిపూడి ఆర్ట్ అకాడమీ నృత్య ప్రదర్శనలకు అమెరికాలో గాత్ర సహకారం అందించి మేల్ ఓకల్ విభాగంలో అవుట్‌స్టాండింగ్ అచీవ్‌మెంట్ అవార్డును కైవసం చేసుకున్నారు. అంతర్జాతీయ కర్ణాటక సంగీతం, నృత్య సంఘం ఐసీఎండీఏ ఆధ్వర్యంలో పద్మశ్రీ డాక్టర్ అన్నవరపు రామస్వామి, పద్మశ్రీ అవసరాల కన్యాకుమారి చేతుల మీదుగా సంగీత శిఖామణి పురస్కారాన్ని ప్రవీణ్ అందుకున్నారు.

రథసప్తమికి ముమ్మర ఏర్పాట్లు

- సుందరంగా ముస్తాబైన ఆలయాలు
- వసతులు కల్పించిన ఆలయ కమిటీలు



రథసప్తమి వేడుకలకు ముస్తాబైన భానుగుడి సూర్యనారాయణస్వామి దేవస్థానం

బోట్‌క్లబ్: రథసప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు నగరంలోని సూర్యనారాయణమూర్తి ఆలయాలు సర్వాంగసుందరంగా ముస్తాబయ్యాయి. ఆలయాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాల వద్ద తోపులాట జరుగకుండా బారికేడ్లు, లైన్లలో వేచి ఉండే భక్తులకు మంచినీరు ప్యాకెట్లు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక భానుగుడి వద్ద ఉన్న ఉషా ఛాయా సమేత సూర్యనారాయణ మూర్తి దేవస్థానంలో రథసప్తమి వేడుకలుకు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువ ఉన్న నేపథ్యంలో ఆలయంలోపల, బయట టెంట్లు, క్యూలైన్లు ఏర్పాటు చేశారు. తెల్లవారుజాము నుంచి స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక బాలత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న సూర్యనారాయణుని దేవస్థానంలో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేసినట్టు ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. స్థానిక సంతచెరువు వద్ద ఉన్న సూర్యనారాయణ స్వామి దేవస్థానంలోను, అయ్యప్పస్వామి దేవస్థానంలో ఉన్న సూర్యనారాయణస్వామి దేవస్థానంలో రథసప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కొండెక్కిన పూజా సామగ్రి

రథసప్తమి వేడుకలకు ఉపయోగించే పూజా సామగ్రి ధరలు కొండెక్కికూర్చున్నాయి. పూజకు ఉపయోగించే చెరకు గడ, రేగుపళ్లు, ఆవు పిడకలు వంటి రేట్లు భారీగా పెరిగాయి. చెరకు గడ రూ.10, చిన్నగ్లాసు రేగుపళ్లు రూ.20, ఐదు ఆవుపిడకలు రూ.30 పెరిగిపోయాయి. రథసప్తమి సందర్భంగా పూజా సామగ్రి విక్రయించే దుకాణాలతో భానుగుడి, అశోక్‌నగర్, గాంధీనగర్, సర్పవరం జంక్షన్, రామారావుపేట, బాలాజీచెరువు సెంటర్, పెదమార్కెట్ వంటి ప్రాంతాలు కిటకిటలాడాయి.



పెద్దమార్కెట్‌లో రేగుపళ్లు, ఆవు పిడకలు కొనుగోలు చేస్తున్న మహిళ

ముగిసిన రహదారి భద్రతా వారోత్సవాలు



డ్రైవర్లను సత్కరిస్తున్న అధికారులు

కాకినాడ సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన రహదారి భద్రతా మాసోత్సవాలు ముగింపు కార్యక్రమం గురువారం స్థానిక ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు, జిల్లా ప్రాంతీయ రవాణా అధికారి పీవీ సాయి ప్రసాద్, కాకినాడ ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్‌రెడ్డి, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ షణ్ముఖ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. రోడ్డు భద్రతా నియామాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జిల్లా పరిధిలో ముగ్గురు డ్రైవర్లకు, డిపో పరిధిలో 9 మంది ప్రమాద రహితంగా వాహనాలు నడిపిన డ్రైవర్లకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. తుని డిపో మేనేజర్ ఎస్.కిరణ్ కుమార్, ఏలేశ్వరం డిపో మేనేజర్ జీవీవీ సత్యనారాయణ, ఆర్ఎం కార్యాలయం అసిస్టెంట్ మేనేజర్ ఎస్‌కేఎం బాషా, కాకి నాడ, తుని డిపోల అసిస్టెంట్ మేనేజర్లు టి.బాలకృష్ణ, జీజీ రమణ, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

సామర్లకోట: ఈ నెల 24 నుంచి 26 వరకు జరగనున్న రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల వాల్‌పోస్టర్‌ను వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ కోఆర్డినేటర్ చలమలశెట్టి సునీల్, అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు ఆవిష్కరించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించనున్న ఈ పోటీలపై గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయానికి వచ్చిన సునీల్‌తో పోటీల నిర్వాహక కార్యదర్శి ఉబా జాన్‌మోజెస్, అసిస్టెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కె పట్టాభిరామం వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. వైఎస్సార్ మెమోరియల్ పేరిట రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ జరుగుతున్నట్టు వారు తెలిపారు. స్త్రీ, పురుషుల విభాగాల్లో 13 ఉమ్మడి జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొననున్నట్టు తెలిపారు.



రాష్ట్ర స్థాయి ఖోఖో టోర్నమెంట్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన సునీల్, దొరబాబు

తంటికొండ వెంకన్నకు ప్రత్యేక పూజలు

గోకవరం: మండలంలోని తంటికొండలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, చతుర్దశ కలశారాధన, పంచామృత మండపారాధన, పూర్ణాభిషేకం తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి) దంపతులు గోపూజ చేశారు. అనంతరం స్వామివారికి లక్షతులసీ పూజ, కుంకుమార్చన, మహాశాంతి హోమం, స్వామి, అమ్మవార్లకు కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

నేడు రథసప్తమి వేడుకలు

తంటికొండ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శుక్రవారం రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో సామూహిక పాలు పొంగించే కార్యక్రమం, సూర్యనమస్కారాలు, సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఈఓ గండి వెంకటలక్ష్మీకుమార్ తెలిపారు.